
Vaartha (Sunday magazine) Dt 14/04/13

# అంతర్జాతీయ అవార్డు వరించిన

# హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు

**ప్రపంచంలోని వంద ప్రముఖ మౌలిక వసతుల ప్రాజెక్టులలో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుని ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా గుర్తించటం మనకు గర్వకారణం. అయితే హైదరాబాద్ మెట్రో రైలు ఈ అవార్డుకు ఎలా ఎంపికయిందో తెలుసుకుందామా...**



సమావేశంలో ప్రసంగిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు మేనేజర్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి

ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1 వరకు న్యూయార్క్‌లో జరిగిన "ప్రపంచ మౌలిక వసతుల నాయకత్వ సమావేశం" (గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరం), 14,132 కోట్ల రూ. హైదరాబాద్ మెట్రో రైలును "ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్" (గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్-2013)గా గుర్తించింది. వివిధ దేశాలలో, ముఖ్యంగా ఎన్నికలలో విజయావకాశాలకు అనుగుణంగా నిర్ణయాలు జరిగే ప్రజాస్వామ్య దేశాలలో తగిన మేరకు మౌలిక వసతుల కల్పనకు పెట్టుబడులు జరగడం లేదని, దాని వల్ల దీర్ఘకాలంలో ఆయాదేశాలు ఆశించిన ఆర్థిక ప్రగతిని సాధించలేకపోతున్నా యనే దృక్పథంతో మౌలికరంగ ప్రణాళికల్లో నిష్ణాతులైన అనేక దేశాల నిపుణులు ఏకమై ఈ ఫోరంను 6 సంవత్సరాల క్రితం స్థాపించడం జరిగింది. దీని వార్షిక సమావేశం ఏదో ఒక ప్రపంచ నగరంలో ఏటా 3రోజుల పాటు జరుగుతుంది.

వివిధ దేశాలలో నిర్మితమవుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులను అధ్యయనం చేసి వాటిలో ముఖ్యమైన వంద ప్రాజెక్టులను ప్రతి సంవత్సరం ఈ ఫోరం ముందుగా ఎంపికచేస్తుంది. 'స్ట్రాటజిక్ 100'గా పోటీ పటిమకు, ఉద్యోగ అవకాశాలకు, ఇంధన సామర్థ్యానికి, కాలుష్య నివారణకు తోడ్పడతాయా నిశితంగా పరిశీలించి ఎంపికచేయటం జరుగుతుంది.

ఆ తరువాత 3రోజులపాటు ఆయా ప్రాజెక్టుల సారథులు ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను ఇస్తారు. ఒక్కొక్క ప్రెజెంటేషన్‌ను ఇచ్చే సమయం పది నిమిషాలు. ఈ పదినిమిషాలలో ప్రాజెక్టుకు సంబంధించిన, దేశానికి సంబంధించిన అనేక విషయాలను క్లుప్తంగా చెప్పగలగాలి. తరువాత ఐదు నిమిషాల పాటు చర్చ జరుగుతుంది. వివిధ దేశాల ప్రతినిధులు వేసే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఉదయం 8గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ మూడురోజుల పాటూ సమాంతరంగా ప్రెజెంటేషన్లు జరుగుతాయి. వీటి ఆధారంగా చివరకు 5 విభాగాలలో ప్రపంచపు అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపికచేయటం జరుగుతుంది. ఈ సంవత్సరం ఈ విధమైన పోటీలో 'ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు కొరకు అంతిమంగా మూడు ప్రాజెక్టులు పోటీపడ్డాయి. అవి:

1. అజర్‌బైజాన్‌కు చెందిన ట్రాన్స్ అనటోలియన్ గ్యాస్ పైప్‌లైన్ (7 బిలియన్ డాలర్లు; రు.37,800కోట్లు)

2. భారత్‌కు చెందదిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు (2.66 బిలియన్ డాలర్లు; రు.14,132కోట్లు)

3. కువైట్‌కు చెందిన అల్ అబ్దాలియా సోలార్ ప్లాంట్.

పైన ,చెప్పిన వివిధ నిర్దేశిక సూత్రాల పైన,, హైదరాబాద్ మెట్రో రైలు మేనేజర్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆధారంగా చేసుకుని హైదరాబాద్ మెట్రో రైలును ఈ సంవత్సరపు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. అదేవిధంగా ఈ కింది ప్రాజెక్టులు వాటి వాటి కేటగిరీలలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి.

-ఈ సంవత్సరపు ఉత్తమ ఉద్యోగకల్పన ప్రాజెక్టు: కెనడాకు చెందిన డెట్రాయిట్ రివర్ ఇంటర్నేషనల్ క్రాసింగ్ ప్రాజెక్టు (3.,5 బిలియన్ డాలర్లు? రు.18,900 కోట్లు)

- ఈసంవత్సరపు ఉత్తమ హరిత మౌలిక వసతుల ప్రాజెక్టు: దక్షిణాఫ్రికాకు చెందిన రెన్యూవబుల్ ఎనర్జీ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ ప్రాజెక్టు (5.4 బిలియన్ డాలర్లు; 29.160కోట్లు)

-ఈ సంవత్సరపు ఉత్తమ ఆర్థిక ప్రాజెక్టు: బ్రెజిల్‌కు చెందిన రయో డ జనీరియో ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు (3.2 బిలియన్ డాలర్లు; రు.17,280కోట్లు)

-ఈ సంవత్సరపు ఉత్తమ వ్యూహాత్మక ప్రాజెక్టు: సంయుక్త అరబ్ దేశాలు (యు.ఎ.ఇ.)కి చెందిన ఇతిహాద్ రైల్ ప్రాజెక్ట్ (11 బిలియన్ డాలర్లు; రు.59,400కోట్లు).

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రపంచంలోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టుల కంటే భిన్నంగా, ఉన్నతంగా ఏవిధంగా నిర్మిస్తున్నారనే విషయాన్ని ఎన్.వి.ఎస్.రెడ్డి

Vaartha (Sunday magazine) Dt. 14/04/13.

తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. ఈ ప్రాజెక్టును కేవలం ఒక రవాణా ప్రాజెక్టుగానే కాక నగర పునర్నిర్మాణ కార్యక్రమంగా (అర్బన్ రీ డిజైన్) చేస్తున్నట్లు చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్ డిపోలు, లోకల్ రైళ్లతో మెట్రోను అనుసంధానం చేయటం; స్కైవాక్‌లు, ఫుట్‌పాత్‌లు, ఇతర పాదచారుల్చ సౌకర్యాల కల్పన; మెట్రో స్టేషన్‌లో బైక్ స్టేషన్లు, స్టేషన్‌నుండి సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు; మంచి ప్రజా ప్రయోజన స్థలాల ఏర్పాటు; ప్రజలకు నిత్యావసర వస్తువులు, షాపింగ్ వస్తువులు, ఆఫీస్‌లు, రెస్టారెంట్లు, ఆరోగ్య సదుపాయాలు, అనేక ఇతర సౌకర్యాలు మెట్రో స్టేషన్ల వద్ద ఏర్పాటు; రవాణా ఆధారిత అభివృద్ధి, హరిత మెట్రో స్టేషన్లు, ఇంధన వినియోగాన్ని తగ్గించడం, ఇంజనీరింగ్ ఆవిష్కరణల ద్వారా ప్రాజెక్టు ఖర్చు తగ్గించడం, మెట్రో ద్వారా హైదరాబాద్‌ను ఒక ప్రజా స్నేహిత, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే ప్రణాళిక వంటి అనేక విషయాలను వివరించడం జరిగింది.

ఆర్థిక సంస్కరణల తర్వాత భారత దేశంలోని టెలికమ్యూనికేషన్ల వ్యవస్థలోను, జాతీయ రహదారుల్లోను, ఓడరేవుల్లోను, విమానయాన, విద్యుత్ రంగాలలోను, ఇతర మౌలిక వసతుల కల్పనలోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఏవిధంగా విప్లవాత్మకమైన మార్పులను అభివృద్ధిని సాధించడం జరిగిందో ప్రెజెంటేషన్లో వివరించారు. ప్రపంచంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిన నిర్మితమవుతున్న అతి పెద్ద మెట్రో రైల్ ప్రాజెక్టు అయిన హైదరాబాద్ మెట్రో రైలును ఏవిధంగా తీర్చిదిద్దుతున్నారో, అనేక అవాంతరాలను ఎలా అధిగమించి నిర్మిస్తున్నారో వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్టును అతి తక్కువ ఖర్చుతో (అభివృద్ధి చెందిన దేశాల ఖర్చులో 5వ వంతు) ఏ విధంగా నిర్మిస్తున్నారు?? అభివృద్ధి చెందిన దేశాలలో సైతం సాధ్యం కాని విధంగా మెట్రోరైలును హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఎలా కట్టగలుగుతున్నారు? ప్రాజెక్టుకు వచ్చే ప్రతిఘటనలను ఎలా అధిగమిస్తున్నారు వంటి అనేక విషయాలను వివిధ దేశాల ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్ మెట్రో రైలు ప్రణాళికా విధానాన్ని, ఆర్థిక, ఇంజనీరింగ్ ఆవిష్కరణలను అభినందిస్తూ న్యూయార్క్ మెట్రోపాలిటన్ ట్రాన్స్ పోర్టేషన్ అథారిటీ అధ్యక్షురాలైన శ్రీమతి నూరియా ఫెర్నాండెజ్ ఇటువంటి నూతన పంథాను ఆర్థిక కష్టాలలో ఇరుక్కుంటున్న అమెరికా



అవార్డునందుకుంటూ హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి,

కూడా అనుసరించాలని సూచించారు.

అవార్డుల ప్రదానం చాలా ఆసక్తికరంగా జరిగింది. ఈ అవార్డులను మౌలిక వసతుల కల్పనారంగపు ఆస్కార్ అవార్డులని చెబుతూ, తొలుత కొన్ని నిమిషాల పాటు సస్పెన్సును పొడిగించి ఫోరం అధ్యక్షుడు నార్మన్ ఆండర్సన్ మొదటిగా హైదరాబాద్ మెట్రో రైలు ఉత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా ఎన్నికైందని ప్రకటించారు. సభ చప్పట్లతో మారుమోగింది. హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బూసి శ్యాంబాబ్, ముఖ్యమంత్రి కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి వేదికపైకి వెళ్లి అవార్డును స్వీకరించారు. స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలోని ఒక ప్రాజెక్టుకు ఈ అవార్డు రావడం హర్ష దాయకమని అనేక దేశాల ప్రతినిధులు వారిని అభినందించారు. అక్కడ ఉన్న ప్రవాస భారతీయ ప్రతినిధులు ఎంతో ఆనందంతో వారిని ప్రశంసించారు. ఈ అవార్డు భారతదేశం మౌలికరంగంలో చూపిస్తున్న నవ్యతకు, దార్శనికతకు గుర్తింపు అని అభివర్ణించారు. ఆ తర్వాత మిగిలిన అవార్డుల ప్రదానం జరిగింది.

ఈ సమావేశానికి మౌలిక వసతుల కల్పన, నిర్మాణరంగాల నిపుణులు, ప్రభుత్వ ప్రైవేట్ రంగాల ఉన్నతాధికారులు, బ్యాంకర్లు, ఆర్థిక నిపుణులు, సలహాదారులు దాదాపు 400మంది ప్రపంచపు నలు మూలల నుండి హాజరయ్యారు. ముఖ్యంగా అరబ్ దేశాలలోను, లాటిన్ అమెరికా దేశాలలోను ఈశాన్య ఆసియా దేశాలలోను నిర్మితమవుతున్న అనేక మౌలిక రంగ ప్రాజెక్టులపై ఎక్కువగా ప్రజెంటేషన్లు జరిగాయి. వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పోటాపోటీగా వారి వారి దేశాలలో నగరాలలో నిర్మిస్తున్న అద్భుత వసతుల గురించి, పెట్టుబడులకు ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి వారు అవలంబించే సరళీకృత పెట్టుబడి విధానాల గురించి, ఫిలిప్పైన్స్ వంటి దేశాల ప్రతినిధులు ఆంగ్లభాషలో వారికున్న సౌలభ్యంతో ఏ విధంగా ఐ.టి.కంపెనీలను ఆకర్షించటంలో భారత్ వంటి దేశాలతో పోటీపడుతున్నారో వివరిస్తూ, మొత్తంగా అన్ని దేశాల ప్రతినిధులు ప్రపంచం నలువైపుల నుండి పెట్టుబడులను, నిపుణులను ఆకర్షించే ప్రయత్నాలు చేశారు. అరబ్ దేశాలలో జరుగుతున్న పెద్దపెద్ద రైలు ప్రాజెక్టులు, గేస్ పైప్‌లైన్ ప్రాజెక్టులు, బ్రెజిల్‌లో నిర్మిస్తున్న అనేక రంగాల మౌలిక వసతుల ప్రాజెక్టులు ఎక్కువగా అందరినీ ఆకట్టుకొన్నాయి.

అవార్డులను ప్రదానంచేస్తూ ఎకోనెక్స్ కంపెనీ ముఖ్య కార్యనిర్వాహకులైన లీ జాస్పర్ ఈ వార్షిక అవార్డులు ప్రాజెక్టుల రూపకల్పనలో, నిర్వహణలో చూపుతున్న ప్రతిభను, అత్యున్నత నాయకత్వ పటిమను గుర్తించాయని పేర్కొన్నారు. అవార్డును గెలుచుకున్న ప్రాజెక్టులు ఈకాలపు అత్యున్నత కార్యనిర్వహణ విధానాలకు అద్దంపట్టడంతో పాటు అవి భవిష్యత్తును రూపుదిద్దే మార్గదర్శక ప్రాజెక్టుల సమావేశ అధ్యక్షుడు నార్మన్ ఆండర్సన్ అభివర్ణించారు. హైదరాబాద్ మెట్రోరైల్ రూపకల్పనలోను, నిర్మాణ ప్రక్రియలోను నవ్యతను, విశేష ప్రతిభను కనపరిచి చక్కటి ప్రజెంటేషన్ చేసిన ఎన్.వి...ఎస్.రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఇదీ మన మెట్రో విజయం!

-పి.అబ్బయ్యగౌడ్